

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ :18004251442
యాదాద్రి :1800 425 7106
సూర్యాపేట :1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.109	158	180
సూర్యాపేట	రూ.130	190	220
నల్లగొండ	రూ.129	187	213

ఉష్ణోగ్రత గరిష్ఠం 29.5 । కనిష్ఠం 19.0



సూర్యాపేటలో కౌన్సిలర్లు గైర్హాజరవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు

రెండుచోట్ల వీగి.. మరోచోట నెగ్గి

- ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అవిశ్వాసాల తీరు
- కౌన్సిలర్ గైర్హాజరుతో సూర్యాపేట, ఆలేరులో వీగిన తీర్మానం
- కోదాడలో నెగ్గిన అవిశ్వాసం

సూర్యాపేట, యాదాద్రి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి)/కోదాడ: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మూడు మునిసిపాలిటీలకు శనివారం నిర్వహించిన అవిశ్వాస తీర్మానాల్లో ఒకటి నెగ్గగా, రెండు వీగాయి. సూర్యాపేట మునిసిపల్ చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్లపై మొత్తం 32 మంది కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానానికి నోటీసు ఇవ్వగా, చివరి నిమిషంలో ఒక కౌన్సిలర్ వెనక్కి తగ్గడంతో తీర్మానం వీగింది. మొత్తం 32మందికి 16 మంది బీఆర్ఎస్, 8 కాంగ్రెస్, నలుగురు బీజేపీ, నలుగురు బీఎస్పీలకు చెందిన కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మాన నోటీసుపై సంతకాలు చేశారు. మొత్తం 48 వార్డులకు 47వార్డు కౌన్సిలర్‌కు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం రావడంతో ఆమె తన పదవికి రాజీనామా చేశారు. ప్రస్తుతం 47 మంది కౌన్సిలర్లు ఉన్నారు. మునిసిపల్ 2019 చట్టం ప్రకారం మునిసిపల్ చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టడానికి 2:3 శాతం కౌన్సిలర్ల మద్దతు అవసరం. ఆ మేరకు 32 మంది కౌన్సిలర్లు ఈ నెల 10వ తేదీన అవిశ్వాస తీర్మాన నోటీసు కాపీని కలెక్టర్ వెంకట్రావ్‌కు అందజేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం ఉదయం 11 గంటలకు చైర్‌పర్సన్ అన్నపూర్ణపై, మధ్యాహ్నం ఒంటి గంటకు వైస్‌చైర్మన్ పుట్ట కిశోర్‌పై ఓటింగ్‌కు ఏర్పాట్లు చేశారు.

క్షణక్షణం ఉత్కంఠ

అవిశ్వాస నోటీసుపై ఓటింగ్ ఉండటంతో శనివారం క్షణ క్షణం ఉత్కంఠకు దారి తీసింది. పోలీసులు ఉదయం 8గంటలకే మునిసిపల్ కార్యాలయం ఎదుట బారీకేడ్లతో పాటు భారీబందోబస్తు ఏర్పాటు చేశారు. ఉదయం 10.45గంటలకు కలెక్టర్ వెంకట్రావ్ మునిసిపల్ కార్యాలయ సమావేశ మందిరానికి చేరుకున్నారు. ఉదయం 11 నుంచి 11.30గంటల వరకు ఓటింగ్ ఉండగా, అప్పటివరకు ఏ ఒక్క కౌన్సిలర్ హాజరుకాకపోవడంతో అవిశ్వాస తీర్మానాన్ని వాయిదావేశారు. తిరిగి సాయంత్రం 3గంటలకు మునిసిపల్ చైర్‌పర్సన్‌కు, అదేవిధంగా 4గంటలకు వైస్‌చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్‌కు సమయం కేటాయించారు. సాయంత్రం 3.30 గంటల వరకు ఏ ఒక్క కౌన్సిలర్ రాకపోవడంతో అవిశ్వాసం తీర్మానాన్ని రద్దు చేస్తున్నట్టు కలెక్టర్ ప్రకటించారు.

అటు నుంచి ఇటు మారిన కౌన్సిలర్

అవిశ్వాసానికి తెరలేపుతూ 32 మంది కౌన్సిలర్లు సంతకాలు చేశారు. అవిశ్వాసం నెగ్గడానికి 32మంది కౌన్సిలర్ల మద్దతు అవసరం. ఆ విధంగానే 16మంది తిరుగుబాటు బీఆర్ఎస్ కౌన్సిలర్లు, కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీల మద్దతుతో కలిపి 32మంది చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానానికి సిద్ధమయ్యారు. చైర్‌పర్సన్ రేసులో ఉన్న ఆశావహులు సుమారు 15 రోజులుగా క్యాంపు రాజకీయాలకు తెరలేపుతూ కౌన్సిలర్లను తరలించారు. అయితే 45వ వార్డు కౌన్సిలర్ గండూరి పావనికృపాకర్ రాత్రికిరాత్రే అవిశ్వాస తీర్మానానికి వెనక్కి తగ్గుతూ క్యాంపు నుంచి వచ్చారు. దీంతో చైర్‌పర్సన్‌పై పెట్టిన అవిశ్వాసానికి మద్దతుకు కావాల్సిన 32మంది కౌన్సిలర్లు లేకపోవడంతో 31మంది కౌన్సిలర్లు రాలేక పోయారు. ఒక్క కౌన్సిలర్ వల్ల అవిశ్వాసాన్ని రద్దు చేసుకున్నట్టు మిగిలిన కౌన్సిలర్లు చెబుతున్నారు. 45వ వార్డు కౌన్సిలర్ బీఆర్ఎస్ నుంచి గెలువగా, ప్రస్తుతం బీఎస్పీలో కొనసాగుతున్నారు. వార్డులకు నిధుల కేటాయింపులో సమన్యాయం చేయడంలేదని సూర్యాపేట మునిసిపాలిటీలో అవిశ్వాసానికి ముఖ్యకారణంగా తెలుస్తోంది. దీనికి తోడు మునిసిపల్ చైర్‌పర్సన్ సొంత నిర్ణయాలు, కౌన్సిలర్లకు గుర్తింపు లేకపోవడం అవిశ్వాసానికి కారణంగా మారాయి.

కోదాడలో అవిశ్వాసం నెగ్గింది

కోదాడ మునిసిపల్ చైర్‌పర్సన్ వనపర్తి శిరీష, వైస్‌చైర్మన్ వెంపటి పద్మలపై అవిశ్వాస తీర్మానం నెగ్గింది. మొత్తం కౌన్సిలర్లు 35మంది ఉండగా, ఎక్స్‌అఫీషియో సభ్యులు ఒకరు ఉన్నారు. బీఆర్ఎస్‌కు చెందిన కౌన్సిలర్ ఒకరు మృతి చెందగా, మరో సభ్యురాలు అవిశ్వాస తీర్మానానికి హాజరుకాలేదు. దీంతో 35 మందిలో 32 మంది హాజరు కాగా, వారిలో 29మంది చేతులెత్తి అవిశ్వాస తీర్మానానికి మద్దతు పలకడంతో చైర్‌పర్సన్ శిరీష తన పదవిని కోల్పోయినట్టు ఆర్డీవో సూర్యనారాయణ ప్రకటించారు. చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నిక విషయంపై కలెక్టర్ ఎన్నికల సంఘానికి, సీడీఎంఏకు నివేదిక అందిస్తారని, అక్కడి నుంచి అనుమతులు వచ్చిన అనంతరం నూతన చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్‌ల ఎన్నిక ఉంటుందని తెలిపారు.

పార్టీ బలాబలాలు

కోదాడ మునిసిపాలిటీలో 35వార్డులు ఉండగా 2020లో జరిగిన మునిసిపల్ ఎన్నికల్లో 25మంది బీఆర్ఎస్ నుంచి గెలుపొందగా, కాంగ్రెస్ పార్టీ నుంచి 8, టీడీపీ ఒకటి, సీపీఐ ఒకరు గెలచుకున్నారు. కాగా బీఆర్ఎస్‌కు చెందిన 25వార్డు కౌన్సిలర్ చింతనాగమణి ఇటీవల మృతి చెందగా, ఆ పార్టీ నుంచి 24మంది కౌన్సిలర్లు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. బీఆర్ఎస్ నుంచి చైర్‌పర్సన్‌గా వనపర్తి శిరీష, వైస్‌చైర్మన్‌గా వెంపటి పద్మ ఉన్నారు. గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్‌కు చెందిన ఎనిమిది మంది కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో బీఆర్ఎస్ బలం 24 నుంచి 16కు తగ్గింది.
అదే సమయంలో చైర్‌పర్సన్ శిరీష, ఎన్నికల సమయంలో బీఆర్ఎస్‌కు పనిచేయడం, మరో 11మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్ వైపు మొగ్గుచూపడం, అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలవడంతో చైర్‌పర్సన్, వైస్‌పర్సన్‌పై అవిశ్వాసానికి తెరలేపారు. ఫలితంగా బీఆర్ఎస్‌కు చెందిన 24మందిలో నలుగురు అవిశ్వాసాన్ని వ్యతిరేకించగా, ఒకరు హాజరుకాలేదు. అవిశ్వాస తీర్మానంపై మద్దతుగా ఓటింగ్‌లో బీఆర్ఎస్ కౌన్సిలర్లు 19 మంది, కాంగ్రెస్ పార్టీకి చెందిన 8, టీడీపీ ఒకరు, సీపీఐ ఒకరు ఓటు వేయటంతో అవిశ్వాసం నెగ్గినట్లయింది.

ఆలేరు మునిసిపాలిటీలో..


ఆలేరు మునిసిపాలిటీ చైర్మన్ పస్పరి శంకరయ్యపై పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగింది. చైర్మన్‌పై అవిశ్వాసం కోరుతూ మొత్తం 8మంది సభ్యులు సంతకాలు చేసి, కలెక్టర్‌కు విన్నవించగా, శనివారం అవిశ్వాస తీర్మానంపై జరిగిన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మునిసిపాలిటీలో మొత్తం 12 మంది కౌన్సిలర్లు ఉండగా, ఐదుగురు కౌన్సిలర్లు మాత్రమే హాజరయ్యారు. చైర్మన్‌తోపాటు మిగతా ఆరుగురు కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. దీంతో ఉదయం 11గంటల సమయంలో జరగాల్సిన సమావేశంలో కోరలేకపోవడంతో (మొత్తం 8మంది కౌన్సిలర్లు) ప్రిసైడింగ్ అధికారి, భువనగిరి ఆర్డీవో అమరేందర్ మధ్యాహ్నం 2గంటలకు వాయిదా వేశారు. మధ్యాహ్నం తర్వాత కూడా ఐదుగురు సభ్యులే ఉండటంతో చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగినట్టు ఆర్డీవో ప్రకటించారు. అవిశ్వాసానికి ఐదుగురు బీఆర్ఎస్ కౌన్సిలర్లతో పాటు ఒకరు కాంగ్రెస్, ఒకరు బీజేపీ, ఒకరు స్వతంత్రులతో గతంలో కలెక్టర్‌కు విన్నవించారు. అయితే అవిశ్వాస తీర్మానంపై జరిగిన సమావేశానికి మాత్రం ఇద్దరు బీఆర్ఎస్ కౌన్సిలర్లు హాజరయ్యారు. అవిశ్వాస తీర్మానానికి హాజరైన కౌన్సిలర్లలో ఇద్దరు బీఆర్ఎస్, ఒకరు కాంగ్రెస్, ఒకరు బీజేపీ, ఒకరు స్వతంత్ర కౌన్సిలర్లు ఉన్నారు. చైర్మన్‌తో పాటు ఆరుగురు బీఆర్ఎస్ చెందిన కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. రాత్రికి రాత్రే ముగ్గురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు చైర్మన్ వైపు తిరగడంతో అవిశ్వాసం వీగింది.

డబ్బులకు అమ్ముడు పోయారు

ఆలేరు రూరల్: డబ్బులకు అమ్ముడు పోయి ప్రజా సమస్యలను వదిలేసిన కొంతమంది కౌన్సిలర్లు మోసం చేశారని అవిశ్వాసానికి మద్దతు పలికిన కౌన్సిలర్లు బేతి రాములు, కందుల శ్రీకాంత్, గుత్త శమంతారెడ్డి, సంగు భూపతి, చింతల ఫణి, సునీత ఆరోపించారు. శనివారం ఆలేరు మునిసిపల్ కార్యాలయం వద్ద వారు మాట్లాడారు. అవిశ్వాసం పెడదామని చెప్పి సంతకాలు చేసి డబ్బులకు అమ్ముడు పోయి విలువలను దిగజార్చుకున్నారన్నారు. చైర్మన్‌కు మద్దతు పలికిన కౌన్సిలర్ల బాగోతాలను శ్వేతపత్రం ద్వారా ప్రజలకు తెలియజేస్తామన్నారు. వారికి ప్రజలే తగిన సమయంలో బుద్ధి చెబుతారన్నారు. ప్రజల సంక్షేమాన్ని అభివృద్ధిని కోరుకుంటున్నామని గెలిచినా, ఓడినా ప్రజా క్షేత్రంలోనే ఉంటామన్నారు.

గులాబీ దళం పటిష్టతపై నజర్

- క్షేత్రస్థాయిలోకి బీఆర్ఎస్ అధిష్ఠానం
- అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సమీక్షలు
- ఉమ్మడినల్లగొండ జిల్లాలో ఈ నెల 29న ఆలేరులో సమీక్ష సమావేశం



యాదాద్రి, జనవరి27 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లోపు గులాబీదళాన్ని పటిష్ఠం పరిచేందుకు అధిష్ఠానం చర్యలు తీసుకుంటుంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోవడంతో... లోక్‌సభ నియోజకవర్గాల ముఖ్యనేతలతో సమీక్ష సమావేశాలు నిర్వహించింది. అదే మాదిరిగా అసెంబ్లీ నియోజకవర్గాలవారీగా స్థానిక నేతలతో సమీక్ష సమావేశాలు నిర్వహించేందుకు అధిష్ఠానం సన్నాహాలు చేస్తోంది. ఫిబ్రవరి 10వ తేదీలోగా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ సమావేశాలు పూర్తిచేసేందుకు అధిష్ఠానం కార్యాచరణ ప్రణాళికను రూపొందించింది. మరోవైపు లోక్‌సభ ఎన్నికలు ఏప్రిల్‌లో నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ప్రణాళిక రూపొందించింది. సార్వత్రిక ఎన్నికలు మార్చి, ఏప్రిల్ నెలల్లో పలు విడతల్లో జరుగనున్నాయి. ఎన్నికలకు మరో రెండునెలలు మాత్రమే ఉండటంతో, లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పట్టు నిలుపుకునేందుకు సన్నాహాలు చేస్తోంది. కాంగ్రెస్, బీజేపీ ఇప్పటికే నియోజకవర్గాలవారీగా ఇన్‌చార్జీలను నియమించింది. ఈమేరకు ఆయా పార్టీల సీనియర్ నేతలతో పార్టీ అభ్యర్థులు గెలుపుకోసం వ్యూహాలు రచిస్తున్నారు. అయితే బీఆర్ఎస్ సైతం క్షేత్రస్థాయిలోకి వెళ్లి... పార్టీని బలోపేతం చేసేందుకు చర్యలు చేపట్టింది. నియోజకవర్గాలవారీగా పార్టీలోని సీనియర్ నేతలను ఇన్‌చార్జీల నియామకాలు చేపట్టింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మొత్తం రెండు పార్లమెంట్ స్థానాలు ఉన్నాయి. భువనగిరి పార్లమెంట్ స్థానంలోకి ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలుంటాయి. ఈ నియోజకవర్గం యాదాద్రి భువనగిరి, నల్లగొండ, సూర్యాపేట, రంగారెడ్డి, జనగాంజిల్లాల పరిధిలో ఉంటుంది. భువనగిరి, ఆలేరు, మునుగోడు, నకిరేకల్, తుంగతుర్తి, ఇబ్రహీంపట్నం, జనగామ అసెంబ్లీ నియోజకవర్గాలు భువనగిరి లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ఉంటాయి. నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో నల్లగొండ, మిర్యాలగూడ, నాగార్జునసాగర్, సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, దేవరకొండ నియోజకవర్గాలు ఉన్నాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలో ఆలేరు నియోజకవర్గం నుంచి సమీక్ష సమావేశాలు ప్రారంభంకానున్నాయి. ఈ నెల 29న ఆలేరు నియోజకవర్గ సమీక్ష సమావేశాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేస్తోంది. ఈ మేరకు ఈ నియోజకవర్గానికి ఇన్‌చార్జి శాసనసభ మాజీ స్పీకర్ మధుసూదనాచారిని నియమించింది. మిగతా 11 నియోజకవర్గాలకు కూడా త్వరలోనే ఇన్‌చార్జిల నియామకంతోపాటు సమీక్ష సమావేశాల తేదీలను కూడా ఖరారు చేసేందుకు బీఆర్ఎస్ అధిష్ఠానం సన్నద్ధమవుతోంది. ఈ సమావేశాల్లో ప్రధాన ఎజెండా లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నదే లక్ష్యం. అయితే తెలంగాణలో ఉద్యమ పార్టీగా రెండు పర్యాయాలు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన బీఆర్ఎస్.. అనుహ్యంగా గద్దె దిగిపోవడాన్ని జీర్ణించుకోలేకపోతోంది. స్థానికంగా పార్టీ పటిష్ఠంగా ఉన్నప్పటికీ, అత్యధిక మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థులు గెలవడం వెనుక ఉన్న కారణాలపై ఆరా తీసే పనిలో నిమగ్నమైంది. ఇందులో భాగంగా అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా స్థానిక నేతలతో సమీక్ష సమావేశాలు నిర్వహించిన పక్షంలో, క్షేత్రస్థాయిలోకి పార్టీ సంస్థాగతంగా జరిగిన లోపాలు బయటకు వస్తాయన్న ఆలోచనలో ఉంది. ఈ సమావేశానికి నియోజకవర్గంలోని ముఖ్యమైన నేతలందరూ హాజరుకానున్నారు. పార్టీ బలోపేతంపై ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న అంశాలపై చర్చించనున్నారు.

స్థానిక నేతలను కాపాడుకునే పనిలో బీఆర్ఎస్

అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి చెంది కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. ఈ నేపథ్యంలో స్థానికంగా ఉన్న పార్టీ సీనియర్ నేతలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ఇతర పార్టీల్లోకి వలసలు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే పలు మునిసిపాలిటీల్లో పార్టీ లకతీతంగా చైర్మన్లపై అవిశ్వాస తీర్మానాలు కూడా ప్రవేశపెట్టారు. ఈనేపథ్యంలో బీఆర్ఎస్ సంస్థాగతంగా పటిష్టంగా ఉంటేనే లోక్‌సభతోపాటు రానున్న ఎన్నికల్లో విజయం సాధించే అవకాశం ఉంది. దీంతో పార్టీలోని సీనియర్ నేతలతోపాటు ఎంపీపీలు, జడ్పీటీసీలు, మునిసిపల్ చైర్మన్‌ను, వైస్‌చైర్మన్లు, ఎంపీటీసీ, సర్పంచులో, ఇతర స్థానిక సంస్థల నేతలతో అధిష్ఠానం పెద్దలు సంప్రదింపులు జరుపుతున్నారు. పార్టీపరంగా అన్ని విధాలుగా భవిష్యత్ ఉంటుందని, పార్టీ మారొద్దని సూచనలు చేస్తున్నారు. ఇటీవల భువనగిరితోపాటు పలు మునిసిపాలిటీ చైర్మన్లపై అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో పార్టీపరంగా బలహీనపడిందన్న విమర్శలున్నాయి. దీంతో వెంటనే బీఆర్ఎస్ అధిష్ఠానం మేలుకుంది. శనివారం ఆలేరు, సూర్యాపేట మునిసిపాలిటీల్లో జరిగిన అవిశ్వాస తీర్మానాలు వీగిపోయేలా ప్రయత్నాలు చేసింది. లోక్‌సభ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో బీఆర్ఎస్ మరింత బలపడుతుందని, తెలంగాణలో సమస్యలపై పోరాడేది తమ పార్టీ అన్న భావనను నేతలు, కార్యకర్తల్లో నింపేందుకు అధిష్ఠానం తీవ్రంగా ప్రయత్నాలు చేస్తోంది.

మాజీ ఎమ్మెల్యేలు చురుకైన పాత్ర పోషించాలి



బీఆర్ఎస్‌కు చెందిన పలువురు ఎమ్మెల్యేలు ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఓటమి చెందారు. నియోజకవర్గంలో కార్యకర్తలు, నాయకుల బాగోగులు ఇన్నాళ్లుగా చూసుకున్న వారు... ఓటమి చెందిన నైరాశ్యంతో నియోజకవర్గాలకు కాస్త దూరంగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యేలంతా కూడా నియోజకవర్గాలను చుట్టేస్తూ... లోక్‌సభ ఎన్నికల్లో చురుకైన పాత్ర పోషించాలని అధిష్ఠానం సూచించినట్టు సమాచారం. పార్టీలోని సీనియర్ నేతలతో సమన్వయం చేసుకుంటూ, పార్టీని బలోపేతం చేసే దిశగా అడుగులు వేసేందుకు అసెంబ్లీ నియోజకవర్గాల జరిగే సమీక్ష సమావేశాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని అధిష్ఠానం సూచించింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 12అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ ఫిబ్రవరి 10లోగా సమీక్ష సమావేశాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

పార్లమెంటు ఎన్నికల్లో విజయం సాధిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

- హామీల అమలు చేతగాకనే ఎదురు దాడులా? : జగదీష్‌రెడ్డి

నల్లగొండ, జనవరి 27: వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయఢంకా మోగిస్తుందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. శనివారం మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అధ్యక్షతన జిల్లా కేంద్రంలో నిర్వహించిన నల్లగొండ నియోజకవర్గ ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. హామీల అమలు చేతగాకనే కాంగ్రెస్ నాయకులు, మంత్రులు ఎదురు దాడులు చేస్తున్నారన్నారు. రుణమాఫీ, రైతు బంధు డిమాండ్లు ప్రజల నుంచి వచ్చినవేనని, వాటిని అమలు చేయనందుకే చెప్పులతో దాడులంటూ బెదిరిస్తున్నారన్నారు. కేసీఆర్ కాలి గోటికి కూడా సరిపోని వారు ఆయనపై అడ్డగోలుగా మాట్లాడుతున్నారని అన్నారు. రైతుబంధు అడిగితే చెప్పుతో కొడుతారా అని ప్రశ్నించారు. రూ.15వేల రైతుబంధు వేస్తామని చెప్పిన వారు ఎక్కడికి పోయారని, సోనియా పుట్టిన రోజు నుంచి రూ.2లక్షల రుణమాఫీ అని చెప్పి పట్టించుకోవడం లేదు అన్నారు. వారం, పది రోజుల్లో కేసీఆర్ బయటకు వస్తారని, తొందరలోనే ఆయన నల్లగొండకు వస్తారన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ, రుణమాఫీ చేస్తామని, వృద్ధులకు పింఛన్లు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికీ అమలు చేయలేదన్నారు. కాంగ్రెస్‌కు ప్రజలను మోసం చేయడమే తెలుసని కొద్ది రోజుల్లోనే ప్రజలు తిరుగుబాటు చేస్తారన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఒకలా, లేనప్పుడు ఒకలా ఉండమని, ప్రతీ కార్యకర్తను కాపాడుకుంటామన్నారు. సమావేశంలో జడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, యాదాద్రి భువనగిరి జడ్పీచైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎంసీ.కోటిరెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్, మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్‌రావు, గాదరి కిషోర్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి, కంచర్ల కృష్ణారెడ్డి, రెగట్టే మల్లికార్జున్‌రెడ్డి, మందడి సైదిరెడ్డి, తండు సైదులుగౌడ్, బోనగిరి దేవేందర్, బొర్ర సుధాకర్, ఆలకుంట్ల నాగరత్నంరాజు, కరీంపాషా, కొండూరు సత్యనారాయణ, యాట జయప్రద, తదితరులు పాల్గొన్నారు.

ఆహ్వానించి అవమానం : చాడ అసంతృప్తి

నల్లగొండలో జరిగిన నియోజకవర్గ ఆత్మీయ సమావేశానికి తనను ఆహ్వానించి సమావేశంలో మాట్లాడకుండా, మైకు ఇవ్వకుండా చేయడంపై బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యేలకు, మాజీ ప్రజాప్రతినిధులకు, ముఖ్య నాయకులకు మాట్లాడే అవకాశం కల్పించి, మొదటి నుంచి ఉద్యమంలో ఉండటంతో పాటు రాష్ట్ర కార్యదర్శినైనా తనకు మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి మైక్ ఇవ్వలేదని చాడ కిషన్‌రెడ్డి బాహాటంగానే ఆరోపించారు. మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి ప్రసంగించేంత వరకు ఉన్న కిషన్‌రెడ్డి, ప్రజాప్రతినిధులను సన్మానించే సమయంలో ఆయన తీవ్ర అసంతృప్తితో అనుచరులతో కలిసి వెళ్లిపోయారు. తనను సమావేశానికి ఆహ్వానించి ఎందుకు అవమానిస్తున్నారో అర్థం కావడం లేదని జడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డితో పాటు అక్కడ ఉన్న ముఖ్య నాయకులతో వ్యాఖ్యానించి స్టేజీ దిగి వెళ్లిపోయారు. తాను 2001 నుంచి కేసీఆర్ నాయకత్వంలో పనిచేస్తున్నానని, అధికారంలో ఉన్నప్పుడు ఎలాంటి పదవులు రాకున్నా పార్టీ కోసం పనిచేశానన్నారు. పార్టీ అభ్యర్థి గెలుపు కోసం పనిచేస్తూ వస్తున్న తనను అవమానించేలా వ్యవహరించడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.

యువతకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ టౌన్, జనవరి 27: యువతకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, అందుకే స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుచేస్తున్నట్టు రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంతో పాటు, కనగల్, నల్లగొండ మండలాల్లో రూ.134కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. స్థానిక ఐటీఐ ఆవరణలో రూ.20కోట్లతో చేపట్టనున్న వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రం భవన నిర్మాణానికి నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ డీజీ భిక్షపతి, కలెక్టర్ హరిచందనతో కలిసి భూమిపూజ చేశారు. అనంతరం మాట్లాడుతూ న్యాక్ సెంటర్‌లో మూడు నెలల కాలవ్యవధితో నైపుణ్యాలు పెంచుకునే కోర్సులను ఆఫర్ చేస్తున్నారన్నారు. కోర్సుల్లో చేరిన వారికి ఎలాంటి ఫీజు ఉండదని, భవన నిర్మాణం పూర్తయిన వెంటనే హాస్టల్ సౌకర్యం కల్పిస్తామన్నారు. ప్రతీ మూడు నెలలు ఒక బ్యాచ్‌కు ఉపాధి కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్‌పాటిల్, మిర్యాలగూడ ఎమ్మెల్యే బి.లక్ష్మారెడ్డి, న్యాక్ డైరెక్టర్ రాజిరెడ్డి, మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, ఆర్అండ్‌బీ ఎస్ఈ రాజేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మిషన్‌భగీరథ పేరుతో దోపిడీ

పాఠశాలల్లో ఇప్పటికీ కనీసం స్వచ్ఛమైన తాగునీరు అందించని గత ప్రభుత్వం మిషన్ భగీరథ పేరుతో వేలకోట్లు దోపిడీ చేసిందని మంత్రి వెంకట్‌రెడ్డి ఆరోపించారు. నల్లగొండ మండలం ముషంపల్లిలో రూ.99.80కోట్లతో నల్లగొండ, ముషంపల్లి, ధర్మాపురం, కన్నెకల్, తిప్పర్తి రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. స్థానిక పాఠశాలలో ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. అంతకుముందు నల్లగొండలో బాలసదనం, వృద్ధాశ్రమాల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. జిల్లా కేంద్రంలోని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం మహిళా ప్రాంగణంలో మైనార్టీ మహిళలకు కుట్టు మిషన్ నైపుణ్య అభివృద్ధి శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.

హైలెవల్‌బ్రిడ్జి పనులకు శంకుస్థాపన

కనగల్: దర్వేశిపురం స్టేజీ వద్ద వాయిలేరువంపుపై రూ.12.4కోట్లతో నిర్మిస్తున్న హైలెవల్‌బ్రిడ్జితో పాటు, రోడ్డువిస్తరణ పనులకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలోని దోరెపల్లి నుంచి రేగట్టే వరకు డబుల్‌రోడ్డు విస్తరణకు నిధులు మంజూరు చేసినట్టు తెలిపారు. లచ్చుగూడెం స్టేజీ నుంచి గ్రామ శివారు వరకు బీటీ రోడ్డు, పగిడిమర్రి గ్రామ వాగులో నూతన బ్రిడ్జి నిర్మాణానికి నిధులు కేటాయిస్తానన్నారు. అంతకుముందు రేణుకా ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారిని మంత్రి దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆయనకు ఆలయ ఈవో జయరామయ్య, చైర్మన్ నర్సిరెడ్డి, సిబ్బంది పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అదేవిధంగా కనగల్ వాగులో ఇసుక తవ్వకాలను తాత్కాలికంగా నిలిపివేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. కనగల్ వాగులో ఇసుక తవ్వకాలు ఇలాగే సాగితే భూగర్భ జలమట్టం మరింత పడిపోయే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఎస్ఈ రాజేశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ జ్యోతి, ఎంపీడీవో సోమసుందర్‌రెడ్డి, ఈవో జయరామయ్య, నాయకులు మందడి రామచంద్రారెడ్డి, గడ్డం అనూప్‌రెడ్డి, నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, కృష్ణయ్యగౌడ్, దేప కరుణాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కృష్ణానదిలో అలివి వలలు వినియోగిస్తే కఠిన చర్యలు



స్వాధీనం చేసుకున్న అలవి వలలతో అటవీశాఖ అధికారులు

దేవరకొండ, జనవరి 27: కృష్ణానదిలో బోటింగ్, అలవి వలల నిషేధం ఉందని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని దేవరకొండ రేంజ్ అటవీశాఖ అధికారి సాయిప్రకాష్ హెచ్చరించారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ, నల్లమల కృష్ణానది పరివాహక ప్రాంతం వైజాగ్ కాలనీ, బుగ్గతండా కృష్ణానది పరివాహక ప్రాంతంలో దాడులు నిర్వహించి అలివి వలలతో చేపలుపడుతున్న వారిని అదుపులోకి తీసుకున్నట్టు ఆయన తెలిపారు. పర్యాటకులు కృష్ణాపరివాహక ప్రాంతంలో పర్యటిస్తూ ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను అక్కడే పడవేసి వెళ్లడంతో నీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందన్నారు. వ్యర్థాల కారణంగా నీరు కలుషితమై కొన్ని జాతుల పక్షులు, అటవీ జంతువులు అనారోగ్యానికి గురై మృతిచెందుతాయన్నారు. అలివి వలలో చిక్కుకొని కొన్ని పక్షులు మృతి చెందుతున్నాయన్నారు. కృష్ణానదిలో అలివి వలలు వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట అటవీ శాఖ సెక్షన్ అధికారి శ్రీదేవి, శేఖర్‌రెడ్డి, రాజశేఖర్, శ్రీనివాస్‌నాయక్, మజీద్, తదితరులు ఉన్నారు.

పలువురు సీఐల బదిలీ

నల్లగొండ టౌన్, జనవరి 27: నల్లగొండ, సూర్యాపేట జిల్లాలో పనిచేస్తున్న నలుగురు సీఐలను బదిలీ చేస్తూ ఐజీ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. నల్లగొండ డీటీసీ సీఐ కే.ఆదిరెడ్డిని మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల టౌన్‌కు, హాలియా సీఐ బి.గాంధీనాయక్‌ను మహబూబ్‌నగర్ రూరల్‌కు బదిలీ చేశారు. సూర్యాపేట జిల్లాలో డీఏసీలో సీఐలుగా పనిచేస్తున్న టి.నాగార్జునగౌడ్‌ను మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల రూరల్‌కు, కె.మహేష్‌ను నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ సర్కిల్‌కు బదిలీ చేశారు.

విధులకు హాజరుకాకున్నా వేతనం

సహకరించిన డిప్యూటీ డీఎంహెచ్‌వోతో పాటు మరో అధికారి సస్పెన్షన్

సూర్యాపేట టౌన్, జనవరి 27: విధులకు హాజరుకాకున్నా వేతనం తీసుకున్న ఉద్యోగితో పాటు అతడికి సహకరించిన ఇద్దరు అధికారులు సస్పెండ్ అయ్యారు. ఈ మేరకు ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమశాఖ డైరెక్టర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. వివరాల ప్రకారం సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ల్యాబ్ టెక్నీషియన్‌గా కె.సత్యనారాయణ విధులు నిర్వహించేవాడు. ఆరోగ్య సమస్యల కారణంగా 2022 ఆగస్టు 29వ తేదీ నుంచి 2023 ఆగస్టు 23వ తేదీ వరకు విధులకు గైర్హాజరయ్యాడు. అనంతరం ల్యాబ్ టెక్నీషియన్‌గా ఫారిన్ సర్వీస్ పద్ధతిలో హైదరాబాద్‌లో నారాయణగూడ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటీవ్ మెడిసిన్(ఐపీఎం)కు నారాయణ బదిలీపై వెళ్లాడు. ప్రస్తుతం అక్కడే పని చేస్తున్నాడు. పెన్‌పహాడ్‌లో పనిచేసే కాలంలో గైర్హాజరైన కాలంలో నెల చివరి రోజు పీహెచ్‌సీకి వెళ్లి హాజరు పట్టికలో(అబ్సెంట్ అని ఉండగా దానిపై) సంతకాలు చేసి వేతనాలు తీసుకున్నాడు. ఈ వ్యవహారంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో హర్షవర్ధన్, సీనియర్ అసిస్టెంట్ రోహిణి ఆయనకు సహకరించడంతో సత్యనారాయణ నెల నెలా రూ.73,837 వేతనాన్ని అందుకున్నాడు. డిప్యూటీ డీఎంహెచ్‌వో హర్షవర్ధన్ ఇదే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డ్రాయింగ్, డిస్బర్సింగ్ ఆఫీసర్(డీడీవో)గా ఉన్నారు. ఈ విషయంపై ఇటీవల డీఎంహెచ్‌వో కార్యాలయానికి ఫిర్యాదురావడంతో డీఎంహెచ్‌వో కోటాచలం ఇద్దరు అధికారులతో విచారణ చేయించారు. ఈ విచారణలో హాజరుపట్టికలో ప్రతీ రోజూ గైర్హాజరు అని రాసి ఉండగా, నెల చివరన సంతకం చేసి వేతనాలు తీసుకున్నట్టు తేలింది. మొత్తంగా 11నెలల 26 రోజుల వేతనం రూ.8,76,199 తీసుకున్నాడు. విచారణ నివేదికను కలెక్టర్ వెంకట్రావ్, డైరెక్టర్ ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖకు పంపించారు. అక్రమాలకు పాల్పడిన సత్యనారాయణతో పాటు డిప్యూటీ డీఎంహెచ్‌వో హర్షవర్ధన్, రోహిణిని సస్పెండ్ చేస్తూ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడి మృతి


మధు(ఫైల్)

యాదగిరిగుట్ట రూరల్, జనవరి 27: అనుమానాస్పదస్థితిలో యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలంలోని మల్లాపురం గ్రామంలో శనివారం జరిగింది. సీఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పుచ్చలపల్లి జహంగీర్-లావణ్య దంపతుల కుమారు మధు(22) గ్రామ సమీపంలోని తన వ్యవసాయ బావివద్ద చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్థుల ద్వారా విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు బావివద్దకు వెళ్లారు. తనకుమారుడు అనుమా నాస్పద స్థితిలో పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మధు తండ్రి జహంగీర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

మోత్కూరు ఉన్నత పాఠశాలలో చోరీ

మోత్కూరు, జనవరి 27: యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. పాఠశాల వేదిక వద్ద, మరోచోట ఏర్పాటు చేసిన రెండు ఎల్ఈడీ ఫ్లడ్‌లైట్లు, తరగతి గదుల్లో బిగించిన ఆరు ఫ్యాన్లు, పది ట్యూబ్‌లైట్లు ఎత్తుకెళ్లారు. పాఠశాల హెచ్ఎం తీపిరెడ్డి గోపాల్‌రెడ్డి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలో కూడా తరగతి గదుల తలుపులు విరగ్గొట్టి బెంచీలు, కుర్చీలు, వాష్‌రూంల్లోని బేసిన్లు ధ్వంసం చేశారని హెచ్ఎం పేర్కొన్నారు.

వివాహిత అదృశ్యం

మునగాల, జనవరి 27: సూర్యాపేట జిల్లా మునగాల మండలంలోని కలకోవ గ్రామానికి చెందిన వివాహిత అదృశ్యమైంది. ఎస్ఐ పి. లోకేష్ తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన దండు సరిత(28), భర్త విజయ్‌కుమార్‌తో గొడవపడి ఎవరికీ చెప్పకుండా ఈ 25వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయింది. బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో సరిత తల్లి క్రిష్ణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్సపొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి



భువనగిరి రూరల్, జనవరి 27: చికిత్సపొందుతూ గుర్తుతెలియని వ్యక్తి శుక్రవారం మృతిచెందాడు. భువనగిరి రూరల్ ఎస్ఐ వి. సంతోష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలంలోని రాయిగిరి ఫ్లైఓవర్ సమీపంలో ఈ నెల 20న గుర్తుతెలియని వ్యక్తి స్పృహ లేకుండా పడిపోవడంతో స్థానికులు 108 అంబులెన్స్ సిబ్బందికి ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. చికిత్స నిమిత్తం అతనిని భువనగిరి జిల్లాకేంద్ర ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్సపొందుతూ శనివారం మృతిచెందాడు. పేరు సోమయ్య అని ఆలేరు మండలం సాయిగూడెం అని చెప్పాడని అతనికి సంబంధించిన ఆచూకీ లభించకపోవడంతో మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచినట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహంపై లేత ఉదా రంగు టీషర్ట్, గోదుమరంగు జీన్ పాయింట్ ఉందని, వయస్సు 60 నుంచి 65, ఎత్తు 5 ఫీట్ల 7ఇంచులు ఉన్నాడని, ఆచూకీ కోసం 8712662472 నెంబర్‌కు సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

విద్యుత్ మోటార్ల దొంగల అరెస్టు




పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆటో, పట్టుబడిన వస్తువులు

మోతె, జనవరి 27: పాలేరు వాగు వెంట ఉన్న విద్యుత్ మోటార్లను దొంగిలించి విక్రయించేందుకు వెళ్తున్న వారిని పోలీసులు పట్టుకు న్నారు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా మోతె మండలం మామిళ్లగూడెం(సింగరేణిపల్లి) టోల్‌గేట్ వద్ద శనివారం జరిగింది. ఎస్ఐ డేగల వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం... అక్రమంగా డబ్బు సంపాదన కోసం అలవాటుపడిన యువకులు అనుకున్నదే పనిగా మోటార్ల చోరీలు మొదలుపెట్టారు. అన్నారిగూడేనికి చెందిన మండవ సాయికి చెందిన టీఎస్ 29 టీబీ 8423 నెంబరు గల ప్యాసింజర్ ఆటోలో అన్నారిగూడేనికి చెందిన స్నేహితులు రెడ్డిమళ్ల లోకేష్, నాయిని వినయ్, నర్సింహాపురం గ్రామానికి చెందిన వలిశెట్టి శ్రీనులు కలిసి సాయి ఆటోలో ఈ నెల 25న రంగాపురం తండ శివారులో ఉన్న పాలేరు వాగు పక్కన ఉన్న బండ్ల గాడి వెంట ఉన్న విద్యుత్ మోటార్లను తమతో తీసుకొచ్చిన టూల్‌కిట్, రంపం, రాడ్ సహాయంతో ఐదు విద్యుత్ మోటార్ల తీగలను తొలగించి మోటార్లను ఆటోలో తరలించారు. వాటిని అన్నారిగూడెం గ్రామశివారులో ఉన్న ఉన్నం సత్యనారాయణ మామిడితోటలో దాచిపెట్టారు. శనివారం ఉదయం వా టిని విక్రయించేందుకు తిరిగి అదే ఆటోలో సూర్యాపేట వైపు వస్తుండగా టోల్‌గేట్ వద్ద పోలీసుల వాహనాల తనిఖీలో పట్టుబడ్డారు. మోటార్లు, వస్తువులను, ఆటోను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

64 కిలోల గంజాయి పట్టివేత

చౌటుప్పల్ రూరల్ జనవరి 27: అరకు నుంచి బెంగళూర్‌కు గంజాయిని తరలిస్తున్న ముఠాను యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్ద శుక్రవారం రాత్రి మల్కాజిగిరి జోన్ ఎస్ఓటీ పోలీసులు పట్టుకున్నారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేసి 64 కిలోల గంజాయి, రెండు కార్లు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కేరళ రాష్ట్రానికి పీహెచ్.ఫవాస్(29), అంతుల మోహన్(25), సయ్యద్(30) డ్రైవర్లు, కూలీలుగా పనిచేస్తున్నారు. గంజాయి విక్రయిస్తే అధిక డబ్బులు వస్తాయనే ఆశతో గంజాయి స్మగ్లింగ్ చేస్తున్నారు. వీరు ముగ్గురు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అరకు నుంచి గురువారం రెండు కార్లలో గంజాయితో బయలుదేరారు. ఒక కారులో గంజాయి, మరో కారు పైలట్‌గా ముందు వెళ్తోంది. పక్కా సమాచారం అందుకున్న మల్కాజిగిరి జోన్ ఎస్ఓటీ పోలీసులు చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్ద రెండు కార్లను అడ్డుకున్నారు. రెండు కార్లను పట్టుకొని తనిఖీలు చేయగా ఆల్టోజ్ కారులో 64కిలోల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. గంజాయితో పాటు రెండు కార్లు, మూడు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. దీని మొత్తం విలువ రూ.32.30లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. నిందితులను అరెస్టు చేసి చౌటుప్పల్ కోర్టుకు తరలించారు.

పోలీసులకు చిక్కిన అంతరాష్ట్ర దొంగ


అంతరాష్ట్ర దొంగను పట్టుకున్న పోలీసులు

మిర్యాలగూడ అర్బన్, జనవరి 27: పలు చోరీల్లో ప్రమేయం ఉన్న అంతరాష్ట్ర దొంగను నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. రూరల్ ఎస్ఐ నరసింహులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరు జిల్లా కప్పరాళ్లతిప్ప గ్రామానికి చెందిన తుపాకుల హనుక్‌కుమార్ ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లోని పలు చోరీ కేసుల్లో నిందితుడిగా ఉంటూ తప్పించుకు తిరుగుతున్నాడు. రూరల్ పోలీసులు గూడూరు క్రాస్ రోడ్డు వద్ద వాహన తనిఖీలు జరుపుతున్న సమయంలో ఆంధ్రా వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న నిందితుడు అనూక్ పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించగా అదుపులోకి తీసుకొని విచారించినట్లు ఎస్ఐ తెలిపారు. తమ విచారణలో గత ఏడాది సెప్టెంబరు 13న దామరచర్ల మండల కేంద్రంలో క్రాంతి హోటల్ ఎదుట పార్క్ చేసి ఉన్న కారు అద్దాన్ని ధ్వంసం చేసి డ్రైవర్ సీటు పక్కన ఉన్న బ్యాగులో నుంచి రూ.4.74లక్షలను కాజేసిన కేసులో తన ప్రమేయం ఉన్నట్లు ఒప్పుకున్నాడు. మిర్యాలగూడ రైల్వే స్టేషన్‌లో ఓ ద్విచక్ర వాహనాన్ని దొంగలించి దానిపైనే ఆంధ్రా వైపు పారిపోతున్నట్లు నిందితుడు అంగీకరించినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ నేరాలపై విచారణ పూర్తి కావడంతో కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. గత కొద్ది నెలలుగా తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లో సంచరిస్తూ పలు నేరాలకు పాల్పడుతున్న అంతరాష్ట్ర దొంగను చాకచక్యంగా పట్టుకున్న రూరల్ పోలీసులను డీఎస్పీ వెంకటగిరి, సీఐ సత్యనారాయణలు అభినందించారు.

కారు ఢీకొని 15 మేకలు మృతి

అర్వపల్లి, జనవరి 27: కారు ఢీకొని 15 మేకలు మృతిచెందాయి. ఈ సంఘట సూర్యాపేట జిల్లా అర్వపల్లి మండలం పర్సాయపల్లిలో శనివారం చోటు చేసుకుంది. అర్వపల్లి గ్రామానికి చెందిన మల్లెబోయిన కృష్ణకు చెందిన మేకలు రోడ్డు పక్కన మేస్తుండగా జనగాం నుంచి సూర్యాపేట వైపు వెళ్తున్న కారు రోడ్డు కిందికి దూసుకెళ్లి మేకల గుంపును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 15మేకలు అక్కడికక్కడే మృతిచెందాయి. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. సుమారు రూ.2లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితుడు కృష్ణ ఆవేదన వ్యక్తం చేశాడు.

పచ్చని చెట్లపై.. గొడ్డలి వేటు


నల్లగొండ జిల్లాకేంద్ర లైబ్రరీలో చెట్లను కొట్టేసి బయట కుప్పగా వేసిన కూలీలు

- జిల్లాకేంద్ర గ్రంథాలయంలో చెట్లను నరికివేసిన వైనం
- వేసవి సమీపిస్తుండడంతో ఇబ్బందులు పడుతున్న నిరుద్యోగులు, పాఠకులు
- గ్రంథాలయ సిబ్బంది వైఖరికి నిరసనగా ఆందోళన


చెట్టును మొదలు కాడికి నరికివేసిన కూలీలు



'పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు' అంటూ ప్రభుత్వం హరితహారం కార్యక్రమం చేపడుతుంటే.. ఇటు కొందరు అధికారుల నిర్లక్ష్యం మూలాన పచ్చని చెట్లపై గొడ్డలివేటు పడుతోంది. ఎన్నో ఏళ్లుగా పెంచిన చెట్లను మొదళ్ల కాడికి నరికివేయడంతో జిల్లాకేంద్ర గ్రంథాలయంలో నిరుద్యోగులు, పాఠకులు శనివారం నిరసన వ్యక్తం చేశారు.

● నల్లగొండ

జిల్లాకేంద్ర గ్రంథాలయంలో ప్రతీ రోజు సుమారు 300 నుంచి 400 మంది నిరుద్యోగులు వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవడంకోసం వస్తుంటారు. అయితే వారు మధ్యాహ్నంవేళ గ్రంథాలయంలోని ప్రారంభంలో ఉండే గార్డెన్‌లో కూర్చొని భోజనం చేస్తుంటారు. చెట్ల నీడ ఉండడంతో వాళ్లకు ఇన్నాళ్లు ఎలాంటి ఇబ్బంది కలగలేదు. అయితే ఈ నెల 26న గ్రంథాలయ సిబ్బంది ఆదేశాల మేరకు కూలీలు చెట్లను నరికివేశారు. అయితే ఇందులో రోడ్డు వెంట విద్యుత్ స్తంభాల వైర్లకు తలుగుతున్న చెట్ల కొమ్మలతోపాటు లైబ్రరీ గార్డెన్‌లోని చెట్లను కూడా నరికివేశారు. ఇదేమని అడిగితే మీరు ఏం చేసుకుంటారో.. చేసుకోండని గ్రంథాలయ సిబ్బంది సమాధానం ఇచ్చారని నిరుద్యోగులు చెబుతున్నారు. అయితే గార్డెన్‌లోని సుమారు 10 నుంచి 20 వరకు పెద్దపెద్ద చెట్లను నరికివేయడంతో వేసవిలో తమ పరిస్థితి దారుణంగా ఉంటుందని, ఎండ వేడిమిని తట్టుకోవడం కష్టమని ఉద్యోగ అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అదనపు కలెక్టర్ దృష్టికి సమస్యలు

ఇటీవల నల్లగొండ అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ గ్రంథాలయ ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించారు. అయితే ఇటీవల ఆయన గ్రంథాలయాన్ని సందర్శించిన సమయంలో నిరుద్యోగులు పలు సమస్యలను లేవనెత్తారు. ఇందులో ప్రధానంగా సిబ్బంది నిర్లక్ష్యపు విధానాలు మార్చుకోవాలని డిమాండ్ చేశారు. ఏళ్ల తరబడి జిల్లాకేంద్ర గ్రంథాలయంలో తిష్టవేసి, తమ సమస్యలు పరిష్కరించడం లేదని ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

● గ్రంథాలయం ఏర్పాటు చేసిన నాటి నుంచి ప్రధాన ద్వారా ముందు నుంచి గ్రంథాలయంలోకి వచ్చేవారు. అయితే ప్రస్తుతం ముందు నుంచి డోర్ మూసివేసి, సైడ్ నుంచి డోర్ తెరుస్తుండడంతో అందులో చదువుకునే వారికి ఇబ్బంది కలుగుతుందని ఆయనకు వివరించారు. ఎందుకంటే సైడ్ డోర్ నుంచి పాఠకులు, నిరుద్యోగులు, బయట వారు పుస్తక విభాగం పక్కనే ఉన్న పత్రికా విభాగంలోకి వచ్చి వెళుతుంటారు. అదే విధంగా పక్కన వాటర్ ఫిల్టర్ శబ్దం కూడా వస్తుంది. దీంతో పుస్తక విభాగంలో చదువుకునే వారికి ఇబ్బంది అవుతుందని అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అయినా సమస్య పరిష్కారం కాలేదని నిరుద్యోగులు చెబుతున్నారు.

ద్విచక్రవాహనాలు బయట పెట్టమంటే ఎలా?

చదువుకునేందుకు వచ్చే మహిళలు, నిరుద్యోగ అభ్యర్థులు తమ ద్విచక్రవాహనాలు గ్రంథాలయంలో పార్కింగ్ చేసి ఉదయం నుంచి రాత్రి 10 గంటల వరకు చదువుకుంటారు. అయితే గ్రంథాలయ సిబ్బంది తమను బైక్‌లు బయట పెట్టుకోవాలని ఆదేశిస్తున్నారని నిరుద్యోగులు చెబుతున్నారు. అసలే వేసవి కాలం, ఆపై బైక్‌లలో పోయించే పెట్రోల్ అర లీటర్, లీటర్ అది కూడా ఎండకు ఆవిరైపోతే, తాము ఇంటికి ఎలా వెళ్లాలని, తమకు ఆర్థికంగా ఇబ్బందిగా మారుతుందని ఆవేదన చెందుతున్నారు. బయట ఎక్కడ పడితే అక్కడ, రోడ్డు వెంట పెడితే పోలీసుల చలాన్లు తమకు తలకు మించిన భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


ఎండలోనే కూర్చొని మధ్యాహ్న భోజనం చేస్తున్న మహిళా అభ్యర్థులు

భోజనం ఎక్కడ చేయాలి

ఇన్నాళ్లు గార్డెన్‌లోని పచ్చనిచెట్ల కింద నీడలో భోజనం చేశామని, ఇక ఉన్న చెట్లు కొట్టేస్తే తాము భోజనం ఎక్కడ చేయాలని మహిళా నిరుద్యోగ అభ్యర్థులు గ్రంథాలయ కార్యదర్శిని ప్రశ్నించారు. అయితే ఆమె సమాధానంతో నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రంథాలయంలోని రేకుల షెడ్డు కింద ద్విచక్రవాహనాలు తీసి, అక్కడే కూర్చొని తినాలని కార్యదర్శి చెప్పడంతో ఆగ్రహం వ్యక్తంచేశారు. రానున్నది వేసవి.. రేకుల షెడ్డు కింద కూర్చొని ఎలా తినాలని నిరుద్యోగులు ప్రశ్నించారు. కనీసం చెట్ల నీడన కూర్చొని తిందామన్నా కూడా కార్యదర్శి ఒప్పుకోకపోవడం విచారకరమన్నారు.

సిబ్బందిని బదిలీ చేయాలని ఆందోళన


గ్రంథాలయం ఎదుట ఆందోళన చేస్తున్న నిరుద్యోగులు

జిల్లాకేంద్ర గ్రంథాలయంలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న సిబ్బందిని వెంటనే బదిలీ చేయాలని ఉద్యోగార్థులు డిమాండ్‌చేశారు. గ్రంథాలయంలో చెట్ల నరికివేతను నిరసిస్తూ శనివారం గ్రంథాలయంలో నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఉద్యోగ అభ్యర్థులు మాట్లాడుతూ సిబ్బంది నిర్లక్ష్యంతోనే గ్రంథాలయంలో సమస్యలు పేరుకుపోయాయని, వారి తీరు సరిగాలేదని ఆరోపించారు. జిల్లా అధికారులను సిబ్బంది తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపిస్తున్నారు. గ్రంథాలయంలో చెట్లు కొట్టివేయడం ద్వారా శబ్ద, వాయి కాలుష్యం పెరిగి తమ ఆరోగ్యంపై ప్రభావం పడే అవకాశాలున్నాయన్నారు. ఆందోళన చేస్తున్న విషయాన్ని కార్యదర్శి పోలీసులకు సమాచారం చేరవేయడంతో వారు అక్కడికి చేరుకున్నారు. వారు నిరుద్యోగులతో మాట్లాడి నిరసనను విరమింపజేశారు. కార్యక్రమంలో ఉద్యోగ అభ్యర్థులు నీలం వెంకన్న, హనుమంత చారి, యాదగిరి, కొప్పు శివ, శ్రీనివాస్, హరీష్, నాగరాజు, జాని, నాగేశ్వర్‌రావు, నరేష్, శ్రీనాథ్, వినయ్, కోటేష్, సైదులు, అంజలి, మమత పాల్గొన్నారు.

సర్వీస్ వైర్‌కు అడ్డంగా ఉన్నాయని కొట్టించాం

గ్రంథాలయంలో సర్వీస్ వైర్‌కు అడ్డంగా ఉన్న కొన్ని కొమ్మలను మాత్రమే కొట్టించాం. ఆవరణంలో బత్తాయి, మామిడి ఇతర చెట్లను నాటితే నీడ ఉండకుండా కొమ్మలు మాత్రమే తొలగించాం. పచ్చని గడ్డితో గార్డెన్ కూడా ఏర్పాటు చేయడానికి నిర్ణయించాం. ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూస్తున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే పార్కింగ్ బయట ఉండాలని నిర్ణయించాం.

● బాలమ్మ, కార్యదర్శి జిల్లా గ్రంథాలయం

అవహేళన చేస్తున్నారు



ఎన్నో ఏళ్లుగా లైబ్రరీలో పాతుకుపోయిన సిబ్బంది తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. దాతలు విరాళంగా ఇచ్చే పుస్తకాలను లైబ్రరీ నిధుల నుంచి ఖర్చు చేసి తెప్పిస్తున్నట్లు లెక్కల్లో చూపుతున్నారు. సమస్యల పరిష్కారంకోసం వెళితే, మీరేనా? జాబులు కొట్టేది అంటూ అవహేళన చేస్తున్నారు. వీరిని వెంటనే బదిలీ చేయాలి.

నీలం వెంకన్న, ఉద్యోగ అభ్యర్థి

ముగిసిన జాన్‌పహాడ్ దర్గా ఉర్సు


సమాధుల వద్ద భక్తులు


దీపారాదన చేస్తున్న ముజావర్, కొబ్బరికాయ కొడుతున్న భక్తులు

పాలకవీడు, జనవరి 27: సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలంలోని జాన్‌పహాడ్ దర్గా ఉర్సు శనివారం మూడవ రోజు దీపారాధనతో ముగిసింది. ఈ నెల 25న ప్రారంభమైన ఉర్సు శనివారం దర్గా ముజావర్ జాని దీపారాధనతో ముగించారు. చివరిరోజు సుమారు 40వేల మంది భక్తులు మొక్కులు చెల్లించుకు న్నారు. దర్గా ముజావర్ జాని, కుటుంబసభ్యులు, వక్ఫ్‌బోర్డు కమిటీ సభ్యులు ఉర్సు ముగింపు సందర్భంగా శనివారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించి, దీపారాధనతో ముగించారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని నాగుల పుట్ట వద్ద పాలు, గుడ్లతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్గాను దర్శించుకున్న భక్తులు తిరుగు ముఖం పట్టారు. ఉర్సులో సుమారు లక్షకుపైగా భక్తులు పాల్గొన డంతో అక్కడ చెత్త చెదారం, చెరుకు ఆకులు, తినేసిన ఇస్తారాకులు రోడ్లపైన ఎక్కడికక్కడే పేరుకుపోయాయి.

వెంటనే పారిశుధ్య పనులు ప్రారంభిం చాలని ఎంపీడీవో ఆదేశించారు. ఉర్సుకు భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకోవడంతో ఆర్టీసీకి రూ.10లక్షల ఆదాయం వచ్చినట్లు మిర్యా లగూడ, సూర్యాపేట డిపో మేనేజర్లు తెలిపారు. గత సంవత్సరంతో పోల్చుకుంటే రెండు రెట్లు ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

10మంది విద్యార్థులకు అస్వస్థత


బియ్యం పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎంఈవో

అనంతగిరి, జనవరి 27: మధ్యాహ్న భోజనం చేసి పది మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఈ సంఘటన సూర్యాపేటజిల్లా అనంతగిరి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో శనివారం జరిగింది. పాఠశాలలో మొత్తం 32మంది విద్యార్థులు ఉన్నారు. మధ్యాహ్న భోజనంలో వంకాయ కూర వండారు. విద్యార్థులు భోజనం చేసిన తర్వాత అందులో పది మంది విద్యార్థులకు వాంతులయ్యాయి. ఈ విషయాన్ని విద్యార్థుల తల్లిదండ్రుల చెప్పకుండా ఉపాధ్యాయులు ఇళ్లకు పంపించారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. పది మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారన్న విషయం తెలుసుకున్న తహసీల్దార్ రవికుమార్, ఎంఈవో సలీంషరీఫ్, పాఠశాలను సందర్శించారు. తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చారు. తమ పిల్లలు అస్వస్థతకు గురయ్యారన్న సమాచారం కూడా ఇవ్వకుండా ఇళ్లకు పంపడం ఏమిటని అధికారులను ప్రశ్నించారు. దీంతో అధికారులు లోపం ఎక్కడ జరిగిందో తెలుసుకొని చర్యలు చేపడతామని అన్నారు. మధ్యాహ్న భోజన ఏజెన్సీని మార్చాలని విద్యార్థుల తల్లిదండ్రులు తహసీల్దార్, ఎంఈవోకు చెప్పారు. విచారణ జరిపి చర్యలు తీసుకొని మారుస్తామని వారు నచ్చజెప్పడంతో విద్యార్థుల తల్లిదండ్రులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

యాదగిరిక్షేత్రంలో భక్తుల సందడి


లక్ష్మీనృసింహుల నిత్యకల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, జనవరి27: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రంలో శనివారం యాత్రాజనుల పూజల సందడి నెలకొంది. ఇష్టదైవాల దర్శనాల కోసం యాత్రాజనులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దేవదేవుడి దర్శనాల కోసం విచ్చేసిన యాత్రికుల సంచారంతో కొండకింద కల్యాణకట్ట, లక్ష్మీపుష్కరిణి, బస్‌స్టాండ్‌లు, కొండపైన ఆలయ తిరువీధులు, ఉభయ దర్శన క్యూలైన్లు, ప్రధానాలయం, ప్రసాదాల విక్రయశాల తదితర ప్రాంతాలు కోలాహలంగా కనిపించాయి. ఇష్టదైవాన్ని దర్శించుకునేందుకు ధర్మదర్శనాల్లో రెండు గంటలు, ప్రత్యేక దర్శనాల్లో గంట సమయం పట్టినట్టు భక్తులు తెలిపారు. సుమారు 30 వేల మందికి పైగా యాదగిరిక్షేత్రాన్ని సందర్శించినట్టు దేవస్థాన అధికారులు తెలిపారు. కొండకింద అనుబంధ పాతగుట్ట ఆలయంలోనూ భక్తుల రద్దీ కొనసాగింది. పాతగుట్ట ఆలయంలో స్వయంభువులను దర్శించుకున్న యాత్రాజనులు ఆలయ ఆవరణలో పిల్లాపాపలతో సేదదీరారు. ఇదిలా ఉండగా యాదగిరీశుడికి నిత్యవిధి కైంకర్యాలు సంప్రదాయరీతిలో కొనసాగాయి. వేకువజామున సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపిన అర్చకులు స్వయంభువులను, సువర్ణ ప్రతిష్టా అలంకార కవచమూర్తులను వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల నడుమ అభిషేకించి తులసిదళాలతో అర్చించారు. అష్టభుజి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం, నిత్య తిరుకల్యాణోత్సవాలను ఆగమ శాస్త్రరీతిలో నిర్వహించారు. సాయంత్రం అలంకార వెండి జోడు సేవలు, దర్బారు సేవోత్సవం, సహస్రనామార్చనలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. కొండపైన అనుబంధ శివాలయంలో రామలింగేశ్వరుడికి, మహామండపంలోని స్ఫటిక మూర్తులకు నిత్యారాధనలు, యాగశాలలో నిత్య రుద్రహవన పూజలు శైవ సంప్రదాయరీతిలో కొనసాగాయి. వివిధ విభాగాల ద్వారా రూ.55,43,899 ఆదాయం సమకూరినట్టు దేవస్థాన అధికారులు తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి


పరశురాం(ఫైల్)

మోత్కూరు, తుర్కపల్లి, జనవరి 27: యాదాద్రి భువనగిరి జిల్లాలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందారు. మోత్కూరు మునిసిపాలిటీ కౌన్సిలర్ ఎర్రవెల్లి మల్లమ్మయాదయ్య దంపతుల కుమారుడు పరశురాం(30) హైదరాబాద్‌లో కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం తన స్వగ్రామం కొండగడపకు వచ్చాడు. రాత్రి సుమారు 11 గంటలకు తన స్నేహితుడు ఎర్రవెల్లి నరేష్‌తో కలిసి బైక్‌పై హైదరాబాద్‌కు వెళు తుండగా రాజన్నగూడెం సమీపంలో బీటీ చేయడానికి తవ్విన రోడ్డుపై పడి ఇద్దరు గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108లో భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించగా పరశురాం అప్పటికే మృతిచెందాడని డాక్టర్లు చెప్పారు. నరేష్‌ను మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరశురాంకు భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. మృతదేహానికి భువనగిరిలో పోస్టుమార్టం నిర్వహించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే మందుల సామేల్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వంగాల సత్యనారాయణ, పైళ్ల సోమిరెడ్డి, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి, చేడె చంద్రయ్య పరామర్శించారు.

రోడ్డు మూల మలుపు వద్ద..


అరవింద్(ఫైల్)

తుర్కపల్లి మండలకేంద్రానికి చెందిన యెలుగల అరవింద్(20), బింగి శేషు ద్వి చక్రవాహనం (హోండా ఆక్టీవా)పై తుర్కపల్లి నుంచి భువనగిరి వైపు వెళ్తున్నారు. మండలంలోని జేతురాంతండా ఆర్అండ్‌బీ రోడ్డు మూల మలుపు అతి ప్రమాదకరంగా ఉన్న కాళేశ్వరం ప్రాజెక్టు కాలువ వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి అరవింద్ బండి పై నుంచి ఎగిరి కింద పడ్డాడు. అతని తలకు బలమైన గాయాలు తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ద్వి చక్ర వాహనంతో పాటు శేషు పది మీటర్ల లోతులో ఉన్న కాల్వలో పడ్డాడు. యువకులు వెంటనే స్పందించి శేషును కాల్వ నుంచి బయటికి తీశారు. అరవింద్ మృతదేహాన్ని ఆటోలో భువనగిరి జిల్లా ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన శేషును పోలీసులు తమ వాహనంలో భువనగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సలహా మేరకు కుటుంబసభ్యులు హైద్రాబాద్‌కు తరలించారు. అరవింద్ మృతి చెందాడనే విషయం తెలియగానే కుటుంబ సభ్యులు, గ్రామస్థులు భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలి వెళ్లారు. చేతి కందిన కొడుకు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో కుటుంబ సభ్యులు రోదనలు అక్కడున్న వారిని కలిచివేశాయి.

ఆస్తి పంపకాలు జరగక ఆగిన అంత్యక్రియలు


రోదిస్తున్న కుటుంబసభ్యులు

అడ్డగూడూరు, జనవరి 27: ఆస్తి పంపకాలు జరగకపోవడంతో వ్యక్తి అంత్యక్రియలు నిలిచిపోయాయి. ఈ సంఘటన యాద్రాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలంలోని కోటమర్తి గ్రామంలో శనివారం జరిగింది. గ్రామస్థులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం... అడ్డగూడూరు మండలంలోని కోటమర్తి గ్రామానికి చెందిన చిప్పలపల్లి సోమయ్య(58) హైకోర్టులో ఏఎస్ఐ(టీఎస్ఎస్‌పీఎఫ్)తెలంగాణ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. సోమయ్య అనారోగ్యంతో శుక్రవారం సాయంత్రం హైదరాబాద్‌లో మృతిచెందాడు. సోమయ్యకు ఇద్దరు భార్యలు ఉన్నారు. మొదటి భార్య చిప్పలపల్లి ఎల్లమ్మ కొన్ని సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మృతిచెందింది. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. ఎల్లమ్మ మృతి చెందడంతో విజయ అనే మహిళను రెండో వివాహం చేసుకున్నాడు. వీరికి కుమారుడు, కూతురు ఉన్నారు. సోమయ్య మృతదేహాన్ని శనివారం తెల్లవారుజామున స్వగ్రామమైన కోటమర్తికి తీసుకొచ్చారు. అంత్యక్రియలు నిర్వహించేందుకు బంధువులు ఏర్పాటు చేస్తుండగా, మొదటి భార్య కుమారుడు సాయిబాబా తన తండ్రి ఆస్తిలో సమాన హక్కు ఇవ్వాలని గ్రామస్థులు, బంధువులు కోరారు. రెండో భార్య విజయ అందుకు నిరాకరించడంతో వివాదం మొదలైంది. దీంతో అంత్యక్రియలు నిలిచిపోయాయి. పలుమార్లు మాట్లాడినా వివాదం పరిష్కారం కాలేదు. ఆస్తి పంపకాలు పూర్తయిన తర్వాతే అంత్యక్రియలు నిర్వహించాలని సాయిబాబా పట్టుపట్టాడు. దీంతో సోమయ్య మృతదేహాన్ని శనివారం రాత్రి మొత్తం ఇంటి వద్దే ఉంచారు.

దేశంలో అత్యున్నత పదవి సర్పంచ్ : రాంరెడ్డి



సమావేశంలో సర్పంచులను సన్మానించిన జడ్పీటీసీ రాంరెడ్డి, ఎంపీపీ విజయలక్ష్మి

తిప్పర్తి, జనవరి 27: దేశంలోనే అత్యున్నత పదవి అంటే సర్పంచ్ పదవేనని జడ్పీఫ్లోర్ లీడర్ పాశం రాంరెడ్డి అన్నారు. తిప్పర్తి ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఎంపీపీ విజయలక్ష్మీలింగారావు అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలుచేయడం కోసం ప్రయత్నిస్తుందని అన్నారు. ఫిబ్రవరి నెలాఖరులోగా రైతుబంధు నగదును జమ చేయనున్నట్లు తెలిపారు. వరిసాగు చేసే రైతులకు నీటి సమస్య తీవ్రంగా ఉన్నందున మండలంలోని డి -40, 39 కాల్వల ద్వారా కనీసం రెండు పర్యాయాలు సాగు నీటి విడుదలకు మంత్రి వెంకట్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఐదేళ్ల కాలంలో చేసిన అభివృద్ధి పనులతో తాము ఎంతో తృప్తిగా ఉన్నామని, బిల్లుల విషయంలో మాత్రమే కొంత నిరుత్సాహం ఉందని వాపోయారు. గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. సర్పంచుల పదవీ కాలం ఈ నెలాఖరు వరకు పూర్తవుతుండటంతో సమావేశం అనంతరం సర్పంచులను ఘనంగా సన్మానించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ ఏనుగు వెంకట్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, ఎంపీడీవో మహేందర్‌రెడ్డి, ముత్తినేని శ్యాంసుందర్, 26 గ్రామ పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు అధికారులు పాల్గొన్నారు.

ప్రజలపై పెనుభారం మోపుతున్న కేంద్రం



సమావేశంలో మాట్లాడుతున్న బొజ్జ చిన వెంకులు

శాలిగౌరారం, జనవరి 27: బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలపై పెనుభారం మోపిందని, నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటాయని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బొజ్జ చినవెంకులు ఆందోళన వ్యక్తం చేశారు. మండలకేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో జరిగిన సంఘ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పేదలకు ఉపాధి కల్పించే గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కేంద్రం బడ్జెట్‌లో నిధులు తగ్గించి క్రమేపి ఆ పథకాన్ని రద్దు చేయాలని ప్రయత్నిస్తుందని అన్నారు. కేంద్ర వ్యవసాయ శాఖ రైతులకు కేటాయించిన బడ్జెట్ ఖర్చు పెట్టకుండా తిరిగి వెనక్కి ఇచ్చి వేసి రైతులకు ద్రోహం చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 16న జరిగే దేశవ్యాప్త బందులో కార్మికులు, కర్షకులు, రైతులు, అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం కోరారు. డెంకెల లింగయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో వ్యకాస మండల కార్యదర్శి మక్కా బుచ్చిరాములు, నాయకులు సిరిపంగి రాములు, కల్లూరి లింగయ్య, వెంకటయ్య, కొమరయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విద్యలో ప్రతిభ చూపి ఉన్నతస్థాయికి ఎదగాలి



నకిరేకల్‌లో మైనార్టీ స్కూల్‌ను తనిఖీ చేస్తున్న ఎంపీపీ శ్రీదేవి

నకిరేకల్, జనవరి 27: విద్యార్థినులు విద్యలో ప్రతిభ చూపించి ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రుల ఆశయాలను నిలబెట్టాలని ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవిగంగాధర్‌రావు అన్నారు. నకిరేకల్‌లోని మైనార్టీ బాలికల పాఠశాల, వసతి గృహాన్ని శనివారం ఆమె తనిఖీచేసి వసతి ఏర్పాట్లను పరిశీలించి మాట్లాడారు. విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఎంపీపీ విద్యార్థినులతో మాట్లాడి వసతిగృహంలో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఆమె వెంట ఎంపీడీవో రమేష్ దీన్‌దయాళ్, ఉపాధ్యాయులు ఉన్నారు.

క్లబ్ సేవలు విస్తృతం చేయాలి



పుస్తకాలు పంపిణీ చేస్తున్న క్లబ్ సభ్యులు

మిర్యాలగూడటౌన్, జనవరి 27: క్లబ్ సేవలు విస్తృతం చేయాలని వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ బుక్కా శ్రీనివాస్, గవర్నర్ రాచర్ల కమలాకర్ కోరారు. పట్టణంలోని శనివారం జరిగిన వాసవీ, వనిత, కుసుమాంబ క్లబ్ ఇన్‌స్టాలేషన్ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. విద్య, వైద్యంతో పాటు సామాజిక సేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మునిసిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ మాట్లాడుతూ క్లబ్ ఆశయాలతో పాటు పర్యావరణ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని, ప్లాస్టిక్ నియంత్రణపై మహిళలకు అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం క్లబ్ నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో రాయపుడి భవానీ, తిరునగరు పద్మ, కొండూరు ఇందిర, గుండా లక్ష్మి, తల్లం పుష్ప, గంధం లీలారాణి, సుష్మిత, లావణ్య, ఉషాబాల, శ్రీదేవి, రమాదేవి, అనిత, శ్రీదేవి, ఉమాశేఖర్ పాల్గొన్నారు.

గంగాధర్ సేవలు మరువలేనివి : ఎమ్మెల్యే

మిర్యాలగూడ టౌన్, జనవరి 27: ప్రజలకు, పార్టీకి గంగాధర్ చేసిన సేవలు మరువలేనివని ఎమ్మెల్యే బీఎల్‌ఆర్ అన్నారు. కాంగ్రెస్ నాయకుడు తిరునగరు గంగాధర్ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు గంగాధర్‌తో ఉన్న సాన్నిహిత్యాన్ని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో రాజీవ్‌భవన్‌లో గంగాధర్ చిత్రపటానికి కార్యకర్తలు నివాళులర్పించారు. ఈ ప్రాంత ప్రజల మనస్సుల్లో చిరస్థాయిగా నిలిచారని పలువురు ప్రముఖులు పేర్కొన్నారు. కార్యక్రమాల్లో మునిసిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, నాగలక్ష్మి, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, నాయకులు గాయం ఉపేందర్‌రెడ్డి, నీరుకంటి నారాయణ, తలకొప్పుల సైదులు, పయిగిమర్రి నర్సింహారావు, మెరుగు శ్రీను, పగిడి రామలింగయ్య, ఉదయభాస్కర్, సత్యం పాల్గొన్నారు.

గూడూరు గోస



డంపింగ్‌యార్డు నుంచి వెలువడుతున్న పొగ, దోమల వ్యాప్తికి కారణమవుతున్న మురుగునీరు

- విషజ్వరాల బారిన గ్రామస్థులు
- పారిశుధ్యం, వాయు కాలుష్యంతో ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు

మిర్యాలగూడరూరల్, జనవరి 27: ఆ గ్రామంలో ఏ ఇంట చూసినా ఎవరో ఒకరు మంచాన పడ్డారు. పట్టణానికి కూతవేటు దూరంలో ఉన్నా అభివృద్ధి కి ఆమడదూరంలో ఉంది. ఆ గ్రామంలో ఏ వీధి చూసినా ఏమున్నది గర్వకారణం... నిండిన డ్రైనేజీలు, కుప్పలుగా పేరుకున్న చెత్తాచెదారం, లోపించిన పారిశుధ్యం వెరసి ఇంటికొకరు విషజ్వరాల బారినపడ్డారు. పారిశుధ్య లోపంతో దోమలు పెరగడంతో పాటు డంపింగ్‌యార్డు నుంచి పొగ వల్ల శ్వాసకోశ వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారు. అనారోగ్యానికి గురై ఆస్పత్రి పాలై వేలాది రూపాయలు నష్టపోతున్నారు. ఇదీ మిర్యాలగూడ మండలంలోని గూడూరు గ్రామస్థులు గోస. తమ సమస్యలను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



రోగాల బారిన గ్రామస్థులు

గూడూరు గ్రామంలో సుమారు 200 మందికి పైగా అనారోగ్యానికి గురైయ్యారు. 20 రోజులుగా ప్రజలు ఒంటినొప్పులు, జ్వరాల బారిన పడుతున్నారు. దీంతో వైద్యులను సంప్రదించగా పరీక్షలు నిర్వహిస్తుంటంతో సుమారు రూ.10 నుంచి రూ.30వేల వరకు వైద్య ఖర్చులు అవుతున్నట్లు పేర్కొంటున్నారు. దీంతో ఆర్థికంగా నష్టపోతున్నామని వాపోతున్నారు. అధికంగా వృద్ధులు, చిన్నారులు అనారోగ్యంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలుస్తుంది. డ్రైనేజీతో పాటు గ్రామంలోకి డంపింగ్ యార్డు నుంచి వెలువడే పొగతో వాయుకాలుష్యానికి గురై శ్వాసకోశ, ఇతర అనేక రకాల ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం



ప్రజల ఆరోగ్య సమస్యలపై దృష్టి సారించాలని వేడుకొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వైద్యశిబిరం ఏర్పాటు చేయాలని, పారిశుధ్య సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

పడకేసిన పారిశుధ్యం

మిర్యాలగూడ మండలంలోని గూడూరులో పారిశుధ్యం పడకేసింది. పట్టణ సమీపంలోనే ఉన్నా ప్రజా ప్రతనిధులు, అధికారులు అభివృద్ధితో పాటు పారిశుధ్యంపై దృష్టి సారించలేదు. దీంతో విషజ్వరాల బారిన పడుతున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 1895 మంది జనాభా కలిగి ఉన్న గూడూరు గ్రామపంచాయతీలో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా మారింది. దీనికి తోడుగా మంచినీటి సరఫరా మోటార్ల పైపులైన్ లీకేజీలు గ్రామంలో దర్శనమిస్తున్నాయి. దీంతో దోమలు విపరీతంగా విజృంభిస్తూ మలేరియా, టైఫాయిడ్ బారిన పడుతున్నట్లు ప్రజలు వాపోతున్నారు.

కీళ్ల నొప్పులతో ఇబ్బందులు పడుతున్నాం



గత 20 రోజులుగా ఒంటి నొప్పులతో బాధపడుతున్నాం. ఇంట్లోని అందరం అనారోగ్యానికి గురవుతుండటంతో వైద్యులను సంప్రదించినా పూర్తిస్థాయిలో ఏం చెప్పలేకపోతున్నారు. కీళ్ల నొప్పులతో ఇబ్బందిగా ఉంది. తక్షణమే గ్రామంలో అధికారులు వైద్య శిబిరం నిర్వహించి గ్రామస్థుల ఆరోగ్యాన్ని కాపాడాలి.

- మండలోజు శ్రీనివాసచారి, గూడూరు

డ్రైనేజీ సమస్య లేదు

గ్రామంలో ఎలాంటి డ్రైనేజీ సమస్య ఏమీ లేదు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై తగిన చర్యలు చేపడుతున్నాం. దోమల నివారణకు ఫాగింగ్ చేపడుతూ చెత్త పేరుకుపోకుండా పారిశుధ్యాన్ని నిర్వహిస్తున్నాం. ఎప్పటికప్పుడు డ్రైనేజీల్లో చెత్తను సిబ్బందితో తొలగిస్తున్నాం. గ్రామంలో అనారోగ్య సమస్యలను దృష్టిలో ఉంచుకొని వైద్యాధికారులకు సమాచారం అందించి తగిన ఏర్పాట్లకు కృషి చేస్తా.

- పుల్లారెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శి

అధికారుల దృష్టికి తీసుకెళ్తా

గూడూరు గ్రామంలో ప్రజలు అనారోగ్యానికి గురై ఇబ్బందులు పడుతున్నారన్న సమాచారం అందడంతో గ్రామాన్ని సందర్శించాం. గ్రామంలో పారిశుధ్య సమస్య నెలకొన్న విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాను. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి పరీక్షలు నిర్వహించేలా వైద్య సిబ్బందితో కృషి చేస్తున్నాను.

- మోయిద్, మెడికల్ ఆఫీసర్

పట్టభద్రులు ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలి



తహసీల్దార్ కార్యాలయంలో మాట్లాడుతున్న ఆర్డీవో చెన్నయ్య

వేములపల్లి, జనవరి 27: త్వరలో జరగనున్న నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకునేందుకు అర్హులైన ప్రతీ పట్టభద్రుడు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆర్డీవో చెన్నయ్య కోరారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పలు రికార్డులను పరిశీలించి తగు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టభద్రులు ఓటుకు దరఖాస్తు చేసుకునేందుకు ఫిబ్రవరి 6వ తేదీ వరకు చివరి గడువు అని, ఆలోగా సెప్టెంబర్ 2020 వరకు ముందు ఉత్తీర్ణులైన ప్రతీ పట్టభద్రుడు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరూ దరఖాస్తు ఫారంతో ఆధార్, ఓటరు ఐడీ, డిగ్రీ మెమో జీరాక్స్ కాపీలను జతపరిచి తహసీల్దార్ కార్యాలయంలో అందజేయాలని అన్నారు. అదేవిధంగా మండలంలో ఖాళీగా ఉన్న రావులపెంట, తిమ్మారెడ్డిగూడెం రేషన్ దుకాణాలకు త్వరలో నోటిఫికేషన్ విడుదల చేసి డీలర్లను నియమిస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్‌శర్మ, డీటీ నిర్మలాదేవి, సీనియర్ అసిస్టెంట్ ఫాతిమాజహేరా, ఆర్‌ఐలు మహేందర్‌రెడ్డి, స్పందన, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలి : చంద్రారెడ్డి



విజేతలకు బహుమతులు పంపిణీ చేస్తున్న చంద్రారెడ్డి

చిట్యాలరూరల్, జనవరి 27: గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులు క్రీడల్లో రాణించేందుకు ప్రభుత్వం ప్రోత్సహించాలని రైతుసంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు బొంతల చంద్రారెడ్డి అన్నారు. సంక్రాంతి సందర్భంగా మండలంలోని వెలిమినేడులో డీవైఎఫ్‌ఐ, ఎస్‌ఎఫ్‌ఐ, ఐద్వా ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడల్లో గెలుపొందిన విజేతలకు ఆయన బహుమతులు అందజేసి మాట్లాడారు. విద్యార్థులు, యువత విద్యాభ్యాసంతో పాటుగా ఇతర రంగాల్లో కూడా రాణించాలని, క్రీడలపై మక్కువను చూపితే భవిష్యత్తులో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని అన్నారు. యువత చెడుకు దూరంగా ఉండాలని, దురలవాట్లతో అందరికీ ఇబ్బందికరమని సన్మార్గంలో పయనించి ఉత్తములుగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో నాయకులు జిట్ట నగేష్, అరూరి శ్రీను, మల్లం మహేష్, నెలికంటి నర్సింహ, పంది నరేష్, నాతి వెంకట్‌రామయ్య, సాయి, విజయ్‌కుమార్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువులను ఈ- మిషన్ ద్వారా విక్రయించాలి

● *జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్‌కుమార్*

నకిరేకల్, జనవరి 27: ఎరువుల దుకాణ యజమానులు ఈ పాస్ మిషన్ ద్వారా ఎరువులను విక్రయించాలని జిల్లా వ్యవసాయ అధికారి పాల్వాయి శ్రవణ్‌కుమార్ సూచించారు. నకిరేకల్‌లోని ఎరువుల దుకాణాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. దుకాణంలో ఉన్న ఎరువుల నిల్వలను ఎప్పటికప్పుడు సరి చూసుకోవాలని రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి డి.మల్లేష్, వ్యవసాయ విస్తరణ అధికారులు ఉన్నారు.



ఎరువుల షాపులను తనిఖీ చేస్తున్న డీఏవో శ్రవణ్‌కుమార్

జేవీవీ ఆధ్వర్యంలో

చెకుముఖి సైన్ పరీక్ష

నకిరేకల్, జనవరి 27: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నకిరేకల్‌లోని బాలికల గురుకుల పాఠశాలలో శనివారం మండల స్థాయి సైన్స్ పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సైన్స్ ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది. శాస్త్రీయ ఆలోచన కలిగి ఉన్నప్పుడే మూఢ నమ్మకాలు దూరంగా ఉంటాయని వారు బాలికలకు వివరించారు. కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర కమిటీ సభ్యుడు కనుకుంట్ల విద్యాసాగర్‌రెడ్డి, అగ్రికల్చర్ అధికారి రావుల విద్యాసాగర్, కళాశాల ప్రిన్సిపాల్ సునిత, డాక్టర్ శోభారాణి, ఎంఈవో మేకల నాగయ్య పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి: మండల స్థాయి చెకుముకి పోటీలను శనివారం కొండమల్లేపల్లి జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల విభాగంలో కొండమల్లేపల్లి జడ్పీ హైస్కూల్ విద్యార్థులు, ప్రైవేట్ పాఠశాలల విభాగంలో కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం చెరుపల్లి శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా నాయకులు నరసింహ, సైన్స్ ఉపాధ్యాయులు కొర్ర లోక్యానాయక్, సముద్రాల శ్రీనయ్య, కళమ్మ, జనార్ధన్‌రెడ్డి, సైదానాయక్, జగదీష్, చంద్రయ్య, నీరజ, ప్రసాద్ పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠినచర్యలు



పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి

శాలిగౌరారం, జనవరి 27: అనుమతులు లేకుండా ఇసుకను అక్రమ రవాణా చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని నల్లగొండ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి హెచ్చరించారు. శాలిగౌరారం పోలీస్‌స్టేషన్‌ను ఆయన శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులను, పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించి, క్రైం వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణా చేసే వ్యక్తులు, వాహన యజమానులపై కేసులు పెట్టి జైలుకు పంపుతామన్నారు. డివిజన్‌లో క్రైం రేటు తగ్గిందన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలన్నారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులపై సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయనవెంట శాలిగౌరారం సీఐ రాఘవరావు, ఎస్ఐ సతీష్ ఉన్నారు.

ఐఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడిగా మురళీకృష్ణ

దేవరకొండ, జనవరి 27: దేవరకొండ నియోజకవర్గ ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడిగా నేరేడుగొమ్ము మండలం పెద్దమునిగల్ గ్రామానికి చెందిన పొట్టిపాక మురళీకృష్ణను నియమించినట్లు ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు సోమన్న శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. నియామక పత్రాన్ని ఎమ్మెల్యే బాలునాయక్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు సోమన్న అందజేశారు. తన నియామకానికి సహకరించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జానారెడ్డి, ఎమ్మెల్యే బాలునాయక్, జిల్లా అధ్యక్షుడు సోమన్నకు కృతజ్ఞతలు తెలిపారు.

లంబాడ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా సోమ్‌లాల్‌నాయక్

నేరేడుగొమ్ము, జనవరి 27: లంబాడ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా నేరేడుగొమ్ము మండలం పందిరిగుండుతండాకు చెందిన పాత్లావత్ సోమ్‌లాల్‌నాయక్‌ను నియమిస్తూ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొర్ర లక్‌పతినాయక్ ఉత్తర్వులు జారీ చేశారు. లంబాడీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తనను జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించినందుకు రాష్ట్ర అధ్యక్షుడు కొర్ర లక్‌పతినాయక్‌కు సోమ్‌లాల్ నాయక్ కృతజ్ఞతలు తెలిపారు.

స్వర్ణకారులను ప్రభుత్వం ఆదుకోవాలి : గిరి



సమావేశంలో మాట్లాడుతన్న రాచకొండ గిరి

రామగిరి, జనవరి 27: కార్పొరేట్, రెడీమేడ్ వ్యవస్థ వల్ల వృత్తిని కోల్పోతున్న స్వర్ణకారులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రాచకొండ గిరి డిమాండ్ చేశారు. పట్టణంలోని విశ్వబ్రాహ్మణ వసతి గృహంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాలు, పాలకులు ఎన్ని మారినా స్వర్ణకారుల జీవితాల్లో మార్పు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు జిల్లా నూతన కమిటీ ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో సంఘం నాయకులు వెంకటాచారి, చేపూరి భీష్మాచారి, కోల్లోజు సత్యనారాయణచారి, కన్నెకంటి సత్యనారాయణ చారి, చోల్లేటి హరి, చోల్లేటి కొండయ్య, విష్ణుమూర్తి, కృష్ణకుమార్, బ్రహ్మచారి, వెంకటాచారి పాల్గొన్నారు.

బాలికలకు బంగారు భవిష్యత్తు కల్పించాలి

గట్టుప్పల్, జనవరి 27: బాలికలకు బంగారు భవిష్యత్తు కల్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివేష అన్నారు. బాలికల అక్రమ రవాణా విషయంపై మండలంలోని తేరేపల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాల, గట్టుప్పల్ గ్రామంలోని రైతువేదిక, జడ్పీహెచ్ఎస్‌లో శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రతి మహిళ తమ పరిధిలో ఉన్న వారికి అవగాహన కల్పించి రక్షించాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తుల నుంచి మెసేజ్‌లు వస్తే జాగ్రత్తగా ఉండాలని, 1930 టోల్‌ఫ్రీ నెంబర్ సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఇడం రోజా, ప్రజ్వల కోఆర్డినేటర్ శ్రావ్య, శృతి, అసిస్టెంట్ కోఆర్డినేటర్లు శివ, టీచర్లు రమ, జయలక్ష్మి, సుజనా, అంజిబాయ్, జ్యోతి, పెద్దమ్మ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం...

దామరచర్ల: మండలంలోని వీర్లపాలెం గ్రామపంచాయతీ పరిధిలో గల దుబ్బతండాలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శనివారం గోపాలమిత్ర పశు గర్భకోశ వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు మండల పశువైద్యాధికారి సమీనా అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్య శిబిరంలో 43 గేదెలకు సమస్యను గుర్తించి నివారణ వైద్యం అందించడంతో పాటు 21 దూడలకు నట్టల నివారణ మందులు తాగించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ చల్లా అంజిరెడ్డి, ఉపసర్పంచ్ నాగునాయక్, సూపర్వైజర్ శివారెడ్డి, గోపాలమిత్రలు రాంబాబు, ప్రభాకర్ పాల్గొన్నారు.

దామరచర్ల: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా వచ్చే నెల 16వ తేదీన నిర్వహించనున్న గ్రామీణ బంద్, సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ భైరం దయానంద్ అన్నారు. మండల కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్ చట్టాన్ని రద్దు చేయాలన్నారు. సమావేశంలో హమాలీ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు మహేష్, కోటయ్య పాల్గొన్నారు.

మిర్యాలగూడ రూరల్: మండలంలోని 46 గ్రామాల్లో 1 మార్చి 2022 నుంచి 28 జనవరి 2024 వరకు జరిగిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ బృందం ఈ నెల 18 నుంచి 28వ తేదీ వరకు 13వ విడత సామాజిక తనిఖీ చేపట్టినట్లు ఎంపీడీవో గార్లపాటి జ్యోతిలక్ష్మి అన్నారు. మండలంలో చేపట్టి పనులు, వేతన చెల్లింపులపై ఈ నెల 29వ తేదీన ఎంపీడీవో కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ఓపెన్ ఫోరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఓపెన్ ఫోరానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరుకావాలన్నారు.

నార్కట్‌పల్లి: మధుర కవి డాక్టర్ కూరెళ్ల విఠలాచార్యులకు కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ ప్రకటించడంపై నార్కట్‌పల్లిలోని శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు పెండోట సోమయ్య, ఆలయ కమిటీ బాధ్యులు బ్రహ్మచారి, శ్రీనివాసచారి, రమేష్‌చారి, సత్యనారాయణచారి ఒక ప్రకటనలో హర్షం వెలిబుచ్చారు. ఈ సందర్భంగా కూరెళ్ల నివాసానికి వెళ్లి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.

మిర్యాలగూడ అర్బన్: నామినేటెడ్ పోస్టుల్లో ఉమ్మడి జిల్లా బీసీలకు తగిన ప్రాధాన్యతనివ్వాలని బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్‌ను కోరారు. హైదరాబాద్‌లో మహేష్‌కుమార్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జనాభాలో అధికశాతం ఉన్న బీసీలకు చట్ట సభల్లో సముచిత స్థానమిస్తే వెనుకబడిన తరగతులకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్: కార్యకర్తలకు అండగా బీఆర్‌ఎస్ పార్టీ నిలబడుతుందని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పార్టీ కార్యకర్త కుటుంబానికి రూ.2లక్షల చెక్‌ను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ పార్టీ సభ్యత్వం కలిగి ఉండి దురదృష్టావశాత్తూ ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు అధిష్ఠానం న్యాయం చేస్తోందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, నాయకులు నారాయణరెడ్డి, లలిత, మోసిన్‌అలీ పాల్గొన్నారు.

రామగిరి: పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో ఈ నెల 30వ తేదీన మునిసిపల్ ఇన్‌చార్జి చైర్మన్ అబ్బగోని రమేష్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్లు అదనపు కమిషనర్ రవి తెలిపారు. కౌన్సిల్ సభ్యులందరూ సకాలంలో హాజరుకావాలని కోరారు.

చిట్యాలరూరల్: మండలంలోని తాళ్లవెల్లంల గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ జనగాం రవీందర్‌గౌడ్ గ్రామాభివృద్ధికి సహకరించిన పాలకవర్గ సభ్యులు, పంచాయతీ సిబ్బందికి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. సర్పంచ్‌ను కూడా శాలువాతో సభ్యులు, సిబ్బంది, పారిశుధ్య సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ పానుగుళ్ల అంజయ్య, కార్యదర్శి మాధవరెడ్డి, వార్డు సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

శాలిగౌరారం: శాలిగౌరారం నుంచి భైరవునిబండ మీదుగా అమ్మనబోలు వరకు ఉన్న పీఆర్ రోడ్డుకు డబుల్ రోడ్డుగా మార్చాలని, అలాగే భైరవునిబండ నుంచి నార్కట్‌పల్లి మండలం నక్కలపల్లి వరకు పూర్తిగా శిథిలమైన రోడ్డును కూడా డబుల్ రోడ్డుగా మార్చాలని భైరవునిబండ సర్పంచ్ దండ రేణుకఅశోక్‌రెడ్డి కోరారు. మంత్రి సీతక్కను కలిసి వినతిపత్రం సమర్పించారు. మన ఊరు మన బడిలో చేపట్టిన పనులకు బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఈ మేరకు మంత్రి సీతక్క సానుకూలంగా స్పందించినట్లు సర్పంచ్ రేణుక అశోక్‌రెడ్డి తెలిపారు.

రామగిరి: సోషల్ వెల్ఫేర్ శాఖలో పనిచేసిన కత్తుల మహేశ్వర్ అక్రమాలపై విచారణ చేపట్టాలని పట్టణానికి చెందిన కత్తుల విక్రమ్ షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారికి ఫిర్యాదు చేశారు. మహేశ్వర్ సంఘ విద్రోహ శక్తులతో చేతులు కలిపి 1999 నుంచి ఎన్నో అక్రమాలకు పాల్పడమే కాకుండా భూదందాలు చేస్తున్నాడని ఆయన ఫిర్యాదులు పేర్కొన్నారు. అవినీతిపై విచారణ చేసి రికవరీ చేయాలని కోరారు.

హాలియా: గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మాదక ద్రవ్య వ్యసనం అదుపు, నిర్మూలన అనే అంశంపై నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో హాలియాలోని హాలియా పబ్లిక్ స్కూల్‌కు చెందిన పూర్వ విద్యార్థి ఎన్.విష్ణు ప్రథమస్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా విష్ణును కలెక్టర్ హరిచందన, ఎస్పీ చందన దీప్తి ప్రశంసాపత్రాలను అందజేసి అభినందించారు.

మిర్యాలగూడ: తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన ప్రొఫెసర్ కోదండరాంకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వడంపై జేఏసీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. అమరవీరుల పార్కులో వారు మాట్లాడుతూ రాష్ట్ర విభజన కోసం సకల జనులను ఏకం చేసి పోరాడిన కోదండరాం భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాడ్గుల శ్రీనివాస్, మలోత్ దశరథ, రావిరాల అంజయ్య, అరుణ, సీతారాములు, శ్రీనివాస్, శర్మ, అస్లాం, నాగయ్య, మనోజ్, వీటీ, రాజు పాల్గొన్నారు.

చండూరు: చండూరు పట్టణంలో గీతా విద్యాలయంలో స్వపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు బోధించారు. హెచ్ఎం పోలోజు నర్సింహాచారి మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులుగా, సమాజ భవిష్యత్తు వీరిపై ఆధారపడిందన్నారు. విద్యార్థులు చక్కటి ప్రతిభ కనబరిచారని, రాబోవు రోజుల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు.